RNI No. APTEL/25/A3079

# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 2 సంచిక: 3 ఫిబ్రవరి – 2026 పేజీలు: 24

समग्र शिक्षा
Samagra Shiksha
సమగ్ర శిక్ష



# అక్షరాల తోట పచ్చని పంట

# కార్యదర్శి .. మార్గదర్శి

**• తండ్రిని ఒప్పించి బడిబయట బాలుడిని బడికి తిరిగి రప్పించారు**

**• విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ చొరవకు ప్రశంసలు**

గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలో చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'ఆటిజం సపోర్ట్ సెంటర్' ను ఇటీవల పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సందర్శించినప్పుడు పిల్లల హాజరు పరిశీలించారు. గత కొద్ది రోజులుగా బడికి రాని ఓ విద్యార్థి గురించి ఆరా తీయగా.. బడి మానేసి మెకానిక్ పనికి వెళ్తున్నాడని తెలుసుకున్నారు. ఆ అబ్బాయి తండ్రి నాగమల్లేశ్వరరావుని పిలిపించి అడగ్గా ఆయన 'చదువు కంటే పని చేసుకుంటే డబ్బులొస్తాయి?' అని సమాధానం ఇచ్చారు. చదువు వల్ల ప్రయోజనాలు, ప్రభుత్వం చదువుకోసం, విద్యాభివృద్ధికి అందిస్తున్న పథకాలను కోన శశిధర్ వివరించగా, మరుసటి రోజు నుండి పాఠశాలకు పంపిస్తానని చెప్పిన తండ్రి అలాగే తమ పిల్లాడిని బడికి పంపుతున్నారు.









**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**పి.రంజిత్ బాషా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య
**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష
**సలహాసభ్యులు**
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD –1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD –2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్
**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్
**అసిస్టెంట్ ఎడిటర్**
**గణపతి రావు బెహరా,** PRO
**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె.పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)
**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**
**చిత్రకారులు**
**మల్లిక్**


# మన బడి
## మాస పత్రిక



సంపుటి: 2 సంచిక: 3 ఫిబ్రవరి – 2026 పేజీలు: 24

## ఆకుపచ్చని కల సాకారం

పాఠశాల ఆవరణల్లో పచ్చని తోటలు ..పర్యావరణ పరిరక్షణ కోటలుగా నిలుస్తున్నాయి. పూల మొక్కలు పెంచుతున్న పిల్లలు ఆ తోటల్లో విహరించే అందమైన సీతాకోక చిలుకల్లా కనిపిస్తున్నారు. కిచెన్ గార్డెన్స్ అభివృద్ధి చేసి, నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, సహకరిస్తున్న సిబ్బంది గ్రీన్ అంబాసిడర్ల పాత్ర పోషిస్తున్నారు. పిల్లలకు ఆరోగ్యవంతమైన, పోషక విలువలు కలిగిన సేంద్రియ ఆహారం మధ్యాహ్న భోజన పథకం (PM POSHAN) ద్వారా అందించడం, శ్రమదానం విలువ చాటిచెప్పడం, బడితోటనే పుస్తకంగా చేసుకుని పిల్లలకు ప్రకృతి పాఠాలు నేర్పించడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'స్కూల్ న్యూట్రిషన్ గార్డెన్స్' అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు సాగుతోంది. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతి పాఠశాలకు సగటున రూ. 5,000 వరకు 'ఫ్లెక్సీ ఫండ్' (Flexi Fund) కింద నిధులు కేటాయిస్తున్నాం. విత్తనాలు, సేంద్రియ ఎరువులు, తోట పనిముట్ల కొనుగోలుకు ఈ నిధులను ఉపయోగించాలి. విద్యార్థులకు కేవలం పాఠాలే కాకుండా, "చేతల ద్వారా నేర్చుకోవడం" (Learning by doing) అనే సూత్రం ప్రకారం వ్యవసాయాన్ని ఒక జీవన నైపుణ్యంగా కిచెన్ గార్డెన్ల ద్వారా నేర్పుతున్నాం.

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com, manabadimagazine@apschooledu.in,
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/samagrashiksha/ మరియు cse.ap.gov.in

# వి ద్యా వి జ యా లు

## వెదురు.. అదిరేలా



బల్లలు, కుర్చీలు, ర్యాక్ లు, పూల సజ్జాలు ఇలా ఒక్కటేమిటి... ఆ విద్యాలయాల్లో ఎక్కడ చూసినా ఇలాంటివే దర్శనమిస్తాయి. అలాగని చెక్కలతోనో, ప్లాస్టిక్‌తోనో తయారైనవి కావు.. స్థానికంగా పండే వెదురు కలపతో సిద్ధమైనవే. ఖర్చులేని కార్యక్రమం కింద కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఈ ప్రక్రియ సాగుతోంది. సొంతంగా తయారు చేయడంతో పాటు వినియోగాన్ని పెంచే యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 14 కేజీబీవీలున్నాయి. అన్ని చోట్లా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక గిరిజన రైతుల సహకారంతో విద్యార్థినులు కర్రలు సేకరించి ఇలా తయారుచేస్తున్నారు. ఇప్పటికే బలిజిపేట కేజీబీవీలో పెద్దఎత్తున తయారు చేశారు. ఇలా చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి, వెదురు రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో వినూత్నంగా బల్లలు, కుర్చీలు, ర్యాక్ లు తయారుచేయడానికి ప్రభుత్వం సహకరిస్తోంది.







## తొలి ప్రయత్నం.. పసిడి కైవసం

వ్యవసాయ కుటుంబానికి చెందిన బాలిక కరాటేలో తొలి ప్రయత్నంలోనే జాతీయస్థాయిలో పసిడి పతకం సొంతం చేసుకొని ఔరా అనిపించింది. సోమందేపల్లి మండలంలోని జూలుకుంటకు చెందిన రైతు కృష్ణమూర్తి కుమార్తె వైష్ణవి. మొత్తం ఐదుగురు కుమార్తెలు. వైష్ణవి... పాపిరెడ్డిపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. ఒకవైపు బాగా చదువుతూనే.. కరాటేలో మెలకువలు నేర్చుకుంది. జనవరి 4న హిందూపురంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచింది. కరాటే గ్రాండ్ మాస్టర్ రామచంద్ర, మాస్టర్ వేణు నుంచి బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకుంది.



## మా మంచి మాస్టారు..!

తరగతి గదిలో పాఠాలు చెప్పడమే కాదు.. తన విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పించడం తన బాధ్యతే అనుకున్నారు ఓ మాస్టారు. అనుకోవడమే కాదు ఇప్పటి వరకు రూ.50 లక్షల విలువైన పనులు చేపట్టారు.. ఇంకా చేస్తున్నారు. మూడేళ్ల క్రితం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వచ్చిన వాకా వెంకటేశ్వరరెడ్డికి విద్యార్థులంటే అమిత ప్రేమ. వారి ఇబ్బందులను దూరం చేస్తేనే చదువుపై శ్రద్ధ పెట్టి ఎదుగు తారని భావించారు. అందుకు అనుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. తొలుత సమీప గ్రామాల నుంచి బడికి వచ్చేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారని గుర్తించి రూ.2 లక్షలతో అద్దెకు ఆటోలు నడిపించారు. విద్యార్థులకు లక్షలు వెచ్చించి బస్ పాసులు ఇప్పించి ఉదయం, సాయంత్రం విద్యార్థుల వద్దకే బస్సు వచ్చేలా కృషి చేశారు. అంతే కాకుండా గత ప్రభుత్వంలో పునాది దశలో నిలిచిపోయిన అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల పనులను ఏకంగా రూ.30 లక్షల సొంత నిధులతో పూర్తి చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక నిర్మాణం, క్రీడా సామగ్రి మైదానం మరమ్మతులకు రూ.6 లక్షలు వెచ్చించారు. రూ.2.5 లక్షలతో పాఠశాల భవనాలకు రంగులు వేయించి, కార్పొరేట్ హంగులు కల్పించారు వెంకటేశ్వరరెడ్డి మాస్టారు. పాఠశాలలోనే నివాసముంటూ ఉదయం, సాయంత్రం పిల్లలకు చదువు చెబుతు న్నారు. యోగా, ధ్యానం, క్రీడల్లోనూ శిక్షణ ఇప్పిస్తున్నారు.




## బాలికలు భళా .. అండర్ 14 లో విజయం



ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన తిమ్మయ్య దంపతుల కుమార్తె శ్రీలత పెద్దతుంబళంలోని నేషనల్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతోంది. ఆటలపై ఆసక్తితో ఖోఖోలో రోజూ సాధన చేస్తూ. ఆటలో.. పాయింట్లు సాధిస్తూ జట్టు విజయానికి బాటలు వేస్తోంది. విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 ఖోఖో పోటీల్లో పాల్గొని విజయం సాధించింది.

**జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటా**

హొళగుందకు చెందిన సి. భూమిక పదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు వ్యవసాయం, కూలిపనులు చేస్తూ.. జీవనం సాగిస్తున్నారు. భూమిక చదువుతో పాటు కబడ్డీలోనూ రాణిస్తోంది. ఆరో తరగతి నుంచి క్రీడలో మెలకువలు నేర్చుకుంటోంది. రైట్ కార్నర్లో పట్టు వదలకుండా ప్రత్యర్థులను కట్టిపడేస్తుంది. ఉత్తమంగా రాణించినందుకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో కర్నూలు జిల్లా తరపున టీం లీడ్ గా వ్యవహరించింది.. అక్కడ రాణించి జాతీయ స్థాయికి ఎంపికైంది భూమిక.

## లెక్కల మెట్లు సులువుగా ఎక్కేస్తున్నారు

Maths Formulaes Made Easy with "STEPS"

వినూత్న ఆలోచనతో విద్యార్థుల్లో కొత్త ఆలోచనలకు నాంది పలికారు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. మ్యాథ్స్ లో కష్టమైన ఫార్ములాలను సులభంగా నేర్చుకునేలా చేసి చూపించారు. విద్యార్థులు ప్రతిరోజూ నడిచే, కింది నుంచి పైకి తమ తరగతి గదులకు వెళ్లే మెట్లపైనే గణిత సూత్రాలను పెయింట్ తో రాయించారు. దీంతో మెట్లు ఎక్కుతూ దిగుతూ విద్యార్థులు ఆడుతూ పాడుతూ గణిత సూత్రాలను నేర్చుకుంటున్నారు.

పిల్లలకు లెక్కలంటే భయం పోగొట్టాలన్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ ఆలోచనకు గణిత ఉపాధ్యాయుల



అంకితభావం తోడవడంతో లెక్కల మెట్లను రూపొందించారు. పాఠశాలలోని మొదటి, రెండో అంతస్తుకు వెళ్లే మెట్ల మార్గంలోని ప్రతి మెట్టుపై మొత్తం 66 మెట్లపై గణిత సూత్రా లను రాయించారు. 6, 7, 8, 9 తరగతి విద్యా ర్థులకు ఉపయోగపడేలా గణిత భావాలను రాయించారు. మెట్లు ఎక్కినపుడు, దిగినప్పుడు వాటిని చూస్తూ విద్యార్థులు సులభంగా నేర్చుకుంటున్నారు.

### తరగతి గదే.. గణిత ప్రపంచం

పాఠశాల తరగతి గదుల్లో గణిత ఆకారాలను విద్యార్థులు సులువుగా గుర్తుపట్టేలా నక్షత్రాల మాదిరిగా వేలాడదీశారు.. తరగతి గదిని గణిత విశ్వంలా తీర్చిదిద్దారు. అలాగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువగా పునరావృతమయ్యే ముఖ్య సూత్రాలు, భావనలు, గ్రాఫ్లు, పట్టికలు, నిర్వచనాలు తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు.



## నాడు మూతబడి..నేడు మెరుగుపడి..!





ఒకప్పుడు పిల్లలు తక్కువగా ఉండటంతో మూతపడిన పాఠశాల నేడు విద్యార్థులతో కళకళలాడుతుంది. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మేజర్ పంచాయతీ నౌగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఎం. జయరామ్, ఉపాధ్యాయురాలు జె. సునీత విద్యార్థులను ఆకట్టుకునే విధంగా బోధిస్తున్నారు. దీంతో పరిసర గ్రామాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా తమ పిల్లలను ఇదే పాఠశాలలో చదివిస్తున్నారు. 2015-16 విద్యా సంవత్సరంలో నౌగుడ ఎంపీపీఎస్ లో 13 మంది విద్యార్థులున్నారనే కారణంతో సమీపంలోని కోరాడ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఆ తర్వాత కొన్నేళ్ల పాటు బడి తెరచుకోలేదు. గ్రామస్థులు, విద్యాశాఖ అధికారులు కలిసి ఈ విద్యాలయాన్ని పునఃప్రారంభించారు. బడి తెరిచినప్పటి నుండి అక్కడకు వచ్చిన ఉపాధ్యాయులు, సమీప పల్లెలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పించారు. వారి పిల్లలను చేర్పించేలా కృషి చేశారు. అనంతరం విధులు చేపట్టిన ప్రధానోపాధ్యాయుడు జయరామ్, ఉపాధ్యాయురాలు సునీత విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరిగేందుకు కృషి చేశారు. ప్రస్తుతం ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 29 మంది పిల్లలున్నారు. పాఠశాల విద్యా కమిటీ, స్థానికుల సహకారంతో బడిలో మౌలిక సదుపాయాలు కల్పించారు.

సేకరణ: **అమలాపురపు దుర్గా ప్రసాద్**, జర్నలిస్టు

# సామాజిక మాధ్యమాల్లోనూ గురువుది సామాజిక బాధ్యత

- ప్రైవేటు స్కూళ్లు, సంస్థల ప్రమోషన్లు నిషిద్ధం
- బడి వేళల్లో ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనడం నిబంధనల ఉల్లంఘనే
- బడిలో కుల,మత,ప్రాంత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రవర్తన శిక్షార్హం

ఒక మొక్క చెట్టుగా ఎదగడానికి నెలలు పట్టొచ్చు, సంవత్సరాలు పట్టొచ్చు. అదే చెట్టును కొట్టడానికి ఒక్క నిమిషం చాలు. డిజిటల్ యుగంలో సోషల్ మీడియాని వాడని వ్యవస్థలేదు. ఒక్క ట్వీట్ కష్టంలో ఉన్న ఒకరికి సాయం అందిస్తుంది. ఒక్క ఫేస్ బుక్ పోస్టు విద్య, వైద్య సహాయాలను అందిస్తోంది. ఇన్ స్టాలో కొన్ని రీల్స్, యూట్యూబులో కొన్ని షార్ట్స్ ఇంటిల్లిపాదీ చూడదగ్గ వినోదాన్ని అందిస్తున్నాయి. ఇవే సోషల్ మీడియా మాధ్యమాలను వ్యాపార ధోరణితో, చెడు ఆలోచనలతో వాడే వారూ ఉన్నారు. ఎక్కడో ఒక చోట తప్పు జరిగిందని.. సామాజిక మాధ్యమాలను సమాజం మేలు కోసం వాడుతూ ప్రజల జీవితాల్లో మంచి మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నవారు పునరాలోచన చేయాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ విద్యావ్యవస్థను సమున్నతంగా నిలిపేందుకు నిస్వార్థంగా పనిచేస్తున్న ఉపాధ్యాయ లోకం సామాజికమాధ్యమాలను సమాజహితం కోసం వాడటంలో గురుతర బాధ్యత కలిగి ఉండాలి



ఇటీవల పక్క రాష్ట్రంలో ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ పాఠశాల సమయాల్లో వాణిజ్య సంస్థలు, ప్రైవేట్ స్కూళ్ల ప్రమోషన్లు చేసి నిబంధనలను అతిక్రమించిన టీచరుపై ఆ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో, ఉపాధ్యాయులు పాటించాల్సిన నియమ నిబంధనలు తెలుసుకుందాం.

## సమయపాలన:

ఉపాధ్యాయుడు తన వృత్తిలో పాటించవలసిన ప్రాథమిక విధి సమయపాలన. ప్రభుత్వం నిర్దేశించిన పాఠశాల సమయాన్ని ఖచ్చితంగా పాటించాలి. కేవలం హాజరు కావడమే కాకుండా, కేటాయించిన పాఠ్యాంశాలను బోధించడం, కరికులర్, కో-కరికులర్ యాక్టివిటీస్ నిర్వహించడం, విద్యార్థులతో, తల్లిదండ్రులతో నిరంతరం మమేకమవ్వడంతో ఉపాధ్యాయుడు తన బాధ్యతను సంపూర్ణంగా నెరవేర్చినట్లవుతుంది.




## సోషల్ మీడియా వినియోగం

విద్యార్థుల మేలు, వినూత్న బోధన, బడుల బలోపేతం కోసం ఉపాధ్యాయులు చేసే విద్యా సంబంధిత కంటెంట్‌కు ప్రభుత్వం, సమాజం నుంచి ఎప్పుడూ మద్దతు లభిస్తుంది. వ్యక్తిగత ప్రచారం కోసం, ప్రైవేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు చేసే పనులను ప్రభుత్వం అంగీకరించదు. ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల సమయాల్లోనూ, ఆ తరువాత కూడా ప్రైవేట్ స్కూళ్లను ప్రమోట్ చేయడం, ఇతర వాణిజ్య కార్యక్రమాల్లో పాల్గొనడం పూర్తిగా నిషిద్ధం. సమాజ భాగస్వామ్యంతో పాఠశాలలను బలోపేతం చేయాల్సిన ఉపాధ్యాయులు లాభాపేక్ష, స్వార్థం, అత్యాశతో చేసే ఇటువంటి పనులను సమాజం హర్షించదు.

## చట్టపరమైన నిబంధనలు

పాఠశాల ఆవరణ వినియోగం ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ యాక్ట్ 1983 ప్రకారం, పాఠశాల ఆవరణను దేనికి వాడాలి అనే అంశంపై స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి.

* పాఠశాల ఆవరణలో కుల, మతపరమైన కార్యక్రమాలకు అనుమతి లేదు.
* ప్రభుత్వం నిర్వహించే ఎన్నికలు, విద్యార్థులకు అవగాహన

కార్యక్రమాలకు మాత్రమే ప్రాంగణాన్ని ఉపయోగించుకోవచ్చు.

* స్కూలు సెలవు రోజున ఏదైనా ప్రజాపయోగ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలంటే సంబంధిత విద్యాశాఖాధికారి ముందస్తు అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం నిర్ణీత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
* కుల, మత, ప్రాంత విద్వేషాలను ప్రేరేపించేలా ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేయడం నేరం.

## ప్రవర్తనా నియమావళి, శిక్ష

ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్ 1964, 1991 సివిల్ సర్వీసెస్ (CCR), (CCA) నిబంధనల ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీల ప్రచారాల్లో గానీ, సమావేశాల్లో గానీ పాల్గొనకూడదు..

* విధి నిర్వహణ: ప్రతి ఉద్యోగి తన విధుల పట్ల అంకితభావం కలిగి ఉండాలి.
* క్రమశిక్షణ, నిజాయితీ: ఉపాధ్యాయులు నిజాయితీని, క్రమశిక్షణను నిష్పక్షపాత వైఖరిని ప్రదర్శించాలి. ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తించకూడదు.

## ప్రజా సంబంధాలు:

* సమాజం పట్ల ఎల్లప్పుడూ మర్యాదగా ఉండాలి.
* చేయాల్సిన పనులను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసే పద్ధతులను అవలంబించ కూడదు.
* పాఠశాలలోనూ, బయటా నలుగురికి ఆదర్శంగా ఉండేలా ఉపాధ్యాయుల ప్రవర్తన ఉండాలి

## నిషేధం:

1. ప్రభుత్వ అనుమతి లేకుండా సమ్మెలు, నిరసనలు లేదా హంగర్ స్ట్రైక్స్‌లో పాల్గొనకూడదు.

2. ప్రభుత్వ విధానాలను విమర్శించడం లేదా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పత్రికల్లో లేదా రేడియో/టీవీ కార్యక్రమాల్లో సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేయడం నిషేధం.

## వ్యాపారం, అప్పులు:

ప్రభుత్వ అనుమతి లేకుండా సొంతంగా వ్యాపారం చేయకూడదు. ఉపాధ్యాయ ఉద్యోగంలో ఉంటూ ఇతర ఉద్యోగాలు, వ్యాపారాలు చేపట్టకూడదు.


అధికార పరిధిలో ఉన్న వ్యక్తులతో డబ్బు అప్పుగా తీసుకోవడం లేదా ఇవ్వడం చేయకూడదు.

## నిబంధనల ఉల్లంఘిస్తే..

* చట్టబద్ధమైన నియమావళిని ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు.
* విధుల్లో నిర్లక్ష్యం వహించడం, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడం లేదా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయడం వంటి చర్యలను ఉపాధ్యాయునికి తగని ప్రవర్తనగా పరిగణించి, సంబంధిత సేవా నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు .

ఉపాధ్యాయుని దగ్గరకు సమాజంలోని అన్ని వర్గాల, కులాల, మతాల పిల్లలు వస్తారు. కాబట్టి, ఒక ఉపాధ్యాయుడు స్వయం నియంత్రణ కలిగి ఉండటం అత్యంత అవసరం. కేవలం శిక్షలకు భయపడి కాకుండా, విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలనే తపనతో ప్రవర్తించాలి. మనం ఆదర్శంగా ఉన్నప్పుడే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగలం. సామాజిక మాధ్యమాలను అర్థవంతంగా వాడుకుంటూ, విద్యాభివృద్ధికి, పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దాం.

– **కె. రవీంద్రనాథ్ రెడ్డి**, ASPD, సమగ్రశిక్ష



# ఎడ్యుటైన్మెంట్ ట్రెండ్ సెట్టర్స్

* వినూత్న బోధనతో సత్ఫలితాలు
* సరికొత్త ట్రెండ్ ను సెట్ చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు
* "ACTIVITY BASED LEARNING" ఆధారంగా పాఠాలు
* "ఎడ్యుటైన్ మెంట్" కంటెంట్ ద్వారా సరికొత్త విద్యా విప్లవం

*వినూత్న విద్యాబోధనతో సత్ఫలితాలు సాధిస్తున్నారు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు. డిజిటల్ యుగంలో ఎడ్యుటైన్మెంట్ కాన్సెప్టుతో సత్ఫలితాలు సాధిస్తున్నారు. "Activity Based Learning" ఆధారంగా విద్యను నేర్పిస్తున్నారు. ప్రభుత్వం ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యాన్ని నయా టీచింగ్ ట్రెండ్ ద్వారా కార్యరూపంలో పెడుతున్న ఉపాధ్యాయులలో కొందరి విజయ కథనాలు ఇవి..*

## గిరుల్లో అక్షర సిరులు

**రొబ్బ శివప్రసాద్,**

ఈదుల పాలెం ఎంపీపీ స్కూల్, ఎస్జీటీ

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని దట్టమైన అడవులు, కొండల మధ్య ఉన్న గిరిజన పల్లెల్లో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు రొబ్బ శివ ప్రసాద్ మాస్టారు. పాడేరు మండలం, ఈదులపాలెం మండల ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న ఆయన, ఆ పాఠశాల విద్యార్థుల పట్ల చూపుతున్న అంకితభావం రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.

**పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య..**
**ఆకట్టుకుంటున్న విద్యా బోధన...**

ఒక పాఠశాల నాణ్యత ఆ పాఠశాలలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను బట్టి తెలుస్తుంది. గత ఏడాది 35 మంది మాత్రమే ఉన్న విద్యార్థుల సంఖ్యను ఇప్పుడు 45కి పెంచారు. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా, పిల్లల్లో చదువు పట్ల ఆసక్తిని పెంచేలా ఆయన చేపట్టిన కార్యక్రమాలు తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని కలిగించాయి. గిరిజన విద్యా వికాసానికి ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా, ఆయన 2025 సంవత్సరం లో "ఉత్తమ ఉపాధ్యాయ" పురస్కారాన్ని అందుకున్నారు.



## క్లిష్టమైన పాఠాలను ఇష్టంగా మారుస్తారు

**చేవూరి శ్రావణ్ గౌతమ్ కృష్ణ,**

సింగంపల్లి పాఠశాల, ఎస్జీటీ

క్లిష్టమైన పాఠాలను సులువుగా నేర్పించడంలో సిద్ధహస్తులు చేవూరి శ్రావణ్ గౌతమ్ కృష్ణ మాస్టారు. రంగంపేట మండలం సింగంపల్లి పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన, బొమ్మలాటలు, వినూత్న టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ద్వారా, ఆటల ఆధారితంగా విద్యార్థులకు పాఠాలు నేర్పిస్తున్నారు. ఆయన సృజనాత్మకత తన తరగతి గదికే పరిమితం కాకుండా సోషల్ మీడియా వేదికల ద్వారా 'Gowtham Krishna Creative Teaching Corner' పేరు మీద, ఎడ్యుటైన్ మెంట్ కంటెంట్ ను రూపొందిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష నిర్వహిస్తున్న కార్యక్రమాలకు స్టేట్ లెవల్ వర్క్ షాపులో భాగస్వామ్యం అవుతున్నారు. గౌతమ్ కృష్ణ మాస్టారి కృషిని గుర్తించిన ప్రభుత్వం 2025లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది.



## పాఠశాల గదే రంగుల ప్రపంచం

**పొలమరశెట్టి ఇందూదేవి,**

సూరపురాజుపేట స్కూల్, ఎస్జీటీ

పాఠశాల గదిని ఒక రంగుల ప్రపంచంగా మార్చి, పిల్లలను బడి వైపు ఆకర్షించవచ్చని నిరూపించారు పొలమరశెట్టి ఇందూదేవి టీచర్. కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం సూరపురాజు పేట పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఇందూ దేవి, తరగతి గదులను సొంతంగా తయారుచేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తో అలంకరించారు. ఆమె రూపొందించిన 'Hand-made TLM' నమూనాలు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాయి. ఇంగ్లీష్ టీఎల్ఎం తయారీలో ఆమె రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. 'INDU TLM CORNER' అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా తన బోధనా పద్ధతులను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. 2025లో సావిత్రి భాయి పూలే పురస్కారం అందుకున్న ఇందూదేవి, 'toy-based pedagogy' (బొమ్మల ద్వారా బోధన)లో రాష్ట్రం నుండి ఎంపికైన అతికొద్ది మందిలో ఒకరు. ఒత్తిడి లేని, స్వేచ్ఛా వాతావరణంలో విద్యార్థులు విద్యను అభ్యసించాలని అంటున్నారు ఇందూదేవి టీచర్.



## సింగిల్ టీచర్ అద్భుత ప్రగతి

**దున్న మధు,**
అనంతపురం (సోంపేట) స్కూల్, హెచ్ఎం

సింగిల్ టీచర్ గా ఉన్న స్కూల్ లో అద్భుతాలు చేయవచ్చని నిరూపిస్తున్నారు దున్నా మధు మాస్టారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం అనంతపురం పాఠశాలలో హెచ్. ఎంగా, ఉపాధ్యాయునిగా రెండు బాధ్యతలను నిర్వహిస్తున్నదున్నా మధు, ప్రభుత్వ పాఠశాలల ఔన్నత్యాన్ని చాటిచెప్పడానికి సోషల్ మీడియాను వేదికగా చేసుకున్నారు. 'Future Achievers 28' అనే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా ఆయన విద్యార్థుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. ఆ గ్రామంలోని పిల్లలందరూ ప్రైవేట్ బదులకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలకే రావడానికి మధు మాస్టారు చూపుతున్న చొరవ, ఆయన బోధనా పద్ధతులే కారణం. భాషా నైపుణ్యాలు, గణితంలో ఇక్కడి పిల్లలు చూపుతున్న ప్రగతి ఆ గ్రామానికే గర్వకారణంగా మారింది. పాఠశాలకు, సమాజానికి మధ్య బలమైన అనుబంధాన్ని నిర్మించడమే తన లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారు.



## కృత్రిమమేధతో విద్యాబోధన

**కాటిక మౌనిక,**
పోలసానిపల్లి మోడల్ స్కూల్, ఎస్జీటీ

ఏలూరు జిల్లా భీమడోలు మండలం పోలసానిపల్లి మోడల్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ గా విధులు నిర్వర్తిస్తున్నకాటిక మౌనిక "Mounika Teachings" అనే సోషల్ మీడియా వేదికల ద్వారా తన బోధనా పద్ధతులను పరిచయం చేశారు. ఆమె బోధనలో AI టెక్నాలజీని ఉపయోగించి పద్యాలను ట్యూన్ చేయడం, ప్లే వే పద్ధతిలో ఇంగ్లీష్ గ్రామర్ నేర్పించడం వంటి వినూత్న ప్రయోగాలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. మౌనిక టీచర్ రాస్తున్న "టీచర్ డైరీలు" ఇతర ఉపాధ్యాయులకు ఉపయోగపడుతున్నాయి. తను విధులు నిర్వర్తిస్తున్న ఆ పాఠశాలలో 100 శాతం హాజరు నమోదు కావడంతో పాటు, 90 శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల మానిపించి పోలసానిపల్లి స్కూలులో చేర్పించారు.



## డిజిటల్ విద్యా తెలుగు వెలుగు

**సంతోష్ కుమార్ స్వామి,**
ఎం సింగుపురం జెడ్పీ హైస్కూల్

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలంలోని ఎమ్. సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న సంతోష్ కుమార్ స్వామి, అక్షరానికి ఆయువు పోస్తున్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే పద్య రచనపై అవగాహన కల్పిస్తూ, వారిలో సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ఆయన రూపొందించిన పాటలు, షార్ట్ ఫిలిమ్స్ విశేష గుర్తింపు పొందాయి. సంతోష్ మాస్టారి పర్యవేక్షణలో 8వ తరగతి విద్యార్థులు రూపొందించిన ఎనర్జీ కన్జర్వేషన్ షార్ట్ ఫిలిం, రాష్ట్ర స్థాయి పోటీల్లో తృతీయ బహుమతిని గెలుచుకుంది. I.F.P ప్యానెల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వంటి ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ తెలుగు వ్యాకరణాన్ని సులభంగా అర్థమయ్యేలా బోధించడం ఈ తెలుగు మాస్టారి ప్రత్యేకత.



## బోధనకు 'కోట'.. వినూత్న బాట

**జి సిగడాం మోడల్ స్కూల్,** పిజిటి

శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్లో పి.జి.టి తెలుగు మాస్టారు గా విధులు నిర్వర్తిస్తున్నకోట తిరుపతిరావు మాస్టారు, అంకితభావానికి నిలువుటద్దం. 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో వరుసగా ఎనర్జీ కన్జర్వేషన్ లఘు చిత్ర పోటీల్లో రాష్ట్ర స్థాయి బహుమతులు సాధించి తన ప్రతిభను చాటారు. శ్రీకాకుళం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం అందుకున్న ఆయన, సామాజిక అంశాలపై విద్యార్థులతో ర్యాలీలు, నాటికలు వేయిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఆయన కృషి కేవలం అవార్డులకే పరిమితం కాలేదు. తన సొంత నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేయించడం, కళావేదికను నవీకరించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన ఉద్యోగ ప్రస్థానం మొదలైన 2013 నుంచి నేటి వరకు టెన్త్, ఇంటర్ తెలుగు పరీక్షల్లో ఏ ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకపోవడం ఆయన బోధనా పద్ధతులకు నిదర్శనం. సోషల్ మీడియా లో వినూత్న ఎడ్యుటైన్ మెంట్ కంటెంట్ ద్వారా పాఠశాల ప్రవేశాలను తోటి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల సంఖ్యను 640 నుండి 730కి పెంచడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.



## ఆటపాటల అక్షరమాల

**చింతలపూడి శ్రీలక్ష్మీదుర్గ,**
పోలసానిపల్లి ఫౌండేషనల్ స్కూల్

ప్రభుత్వ పాఠశాల అంటే పుస్తకాలు, పాఠాలే కాదు.. అక్కడ ఆనందం, ఆటపాటలు కూడా ఉంటాయని నిరూపిస్తున్నారు చింతలపూడి శ్రీ లక్ష్మీ దుర్గ టీచర్. ఏలూరు జిల్లా భీమడోలు మండలం పోలసానిపల్లి ఫౌండేషనల్ స్కూల్ లో సింగిల్ టీచర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె 1,2,3 తరగతుల విద్యార్థుల స్థాయికి తగ్గట్టుగా విద్యా ప్రవేశ్, FLN యాక్టివిటీస్ చేయిస్తున్నారు. ఒకప్పుడు ఏడుగురు ఉన్న ఈ పాఠశాల, ఆమె చేరిన నెల రోజుల్లోనే 15 మందికి చేరుకుంది. సోషల్ మీడియా వేదికగా ఆమె పంచుకుంటున్న పాఠశాల కార్యక్రమాలు తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచాయి. ముఖ్యంగా, పాఠశాలలోని ఐదుగురు గుజరాతీ విద్యార్థులకు పట్టుదలగా చదువు నేర్పించడం ఆమె నిబద్ధతకు నిదర్శనం. గతంలో గోదావరి నదిపై పడవ ప్రయాణం చేసి ,అక్కడి నుంచి కాలి నడకన పాఠశాలకు వెళ్లి సింగిల్ టీచర్ గా విధులు నిర్వహించింది ఈ టీచరే.



## నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తూ..

**మచ్చా పెంటారావు,**
బిబి పట్టణం జెడ్పీ హైస్కూల్

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బి.బి. పట్టణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మచ్చా పెంటారావు మాస్టారు, గ్రామీణ విద్యార్థుల్లోని ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించాలనే లక్ష్యంతో ఆయన ప్రతిరోజూ సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నారు. "నీ మీద నీకు నమ్మకం ఉంటే.. సగం విజయం సాధించినట్టే" అనే నినాదంతో విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి విద్య పై ఆసక్తి పెంచుతున్నారు. సోషల్ మీడియా వేదికల ద్వారా విద్యా కార్యక్రమాలను, తన విద్యార్థులతో చేయించిన షార్ట్ ఫిలింస్ ను పోస్ట్ చేసి, విద్యార్థుల ప్రతిభను చాటిచెప్తున్నారు. విద్యార్థులతో ఇంటర్వ్యూలు చేయిస్తూ వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నారు.



## అక్షరానికి సామాజిక బాధ్యత తోడైతే..

**ఎనుముల మల్లికార్జునరావు,** విప్పర్ల స్కూల్

ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు బోధిస్తే సరిపోదు, సమాజాన్ని భాగస్వామిని చేయాలని నమ్ముతారు ఎనుముల మల్లికార్జున రావు మాస్టారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం విప్పర్ల పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన, 'శ్రీమన్ ఆల్ ఇన్ఫో' యూట్యూబ్ ఛానల్ ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసానికి తోడ్పడే వీడియో ఎడ్యుటైన్ మెంట్ కంటెంట్ ను రూపొందిస్తున్నారు. ఆయన గతంలో పనిచేసిన కొత్తపల్లి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 90 నుండి 190కి పెంచి, దాతల సహకారంతో సుమారు 12 లక్షల రూపాయలు సేకరించి పాఠశాల మౌలిక సదుపాయాలను మెరుగుపరిచారు. మల్లికార్జున రావు మాస్టారు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ కిచెన్ గార్డెన్ జాతీయ స్థాయిలో ఎల్లో రేటింగ్ సాధించింది. విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ అందించడం, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం పత్రికల్లో వ్యాసాలు రాయడం వంటి కార్యక్రమాల ద్వారా ఆయన విద్యా రంగంలో తనదైన ముద్రవేస్తున్నారు.

– **అమలాపురపు దుర్గా ప్రసాద్,** జర్నలిస్టు





# అక్షరాల తోట పచ్చని పంట

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బడుల్లో అక్షరాలే కాదు, పంటలూ పండుతున్నాయి. పూలు, పండ్లు, ఆకుకూరలు, నీడనిచ్చే మొక్కలూ ఇప్పుడు బడులను ఆహ్లాదకరంగా మారుస్తున్నాయి. పాఠశాల ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు పెంపకం చేపట్టారు. అవి పెరిగి పెద్దయి పిల్లలకు ప్రకృతి పాఠాలు చెబుతున్నాయి. సహజసిద్ధంగా పండిన కాయలు, పండ్లు, ఆకుకూరలు పిల్లలకు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందిస్తున్నాయి. ఆటపాటల సమయంలో కిచెన్ గార్డెన్ లో టీచర్లతో కలిసి పిల్లలు చేస్తున్న సేద్యం వారికి వ్యాయామంగా, సైన్సు పాఠంగా ఉపయోగపడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలను ఆకుపచ్చని క్షేత్రాలుగా తీర్చిదిద్దిన విజయగాథలపై ప్రత్యేక కథనం.

## బడి తోట – ప్రగతికి బాట

**ఎం.పి.పి.ఎస్ అల్లు వీధి పాఠశాల ఘనత**

విజయనగరం జిల్లా, జామి మండలంలోని ఎం.పి.పి.ఎస్ అల్లు వీధి పాఠశాల నేడు ఆదర్శవంతమైన కిచెన్ గార్డెన్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాజారావు ప్రత్యేక చొరవతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, SMC కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు అందరూ కలిసి ఈ బడితోటకు రూపమిచ్చారు. విత్తనాలు నాటడం నుంచి మొక్కల సంరక్షణ వరకు ప్రతి ఒక్కరూ శ్రమదానం చేస్తూ నందనవనంలా తీర్చిదిద్దారు. ఈ కిచెన్ గార్డెన్‌లో ఆరోగ్యకరమైన, పోషక విలువలున్న వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. అరటి, బొప్పాయి, జామ, వంకాయ, బెండకాయ, పచ్చిమిర్చి పండిస్తున్నారు. విద్యార్థులు స్వయంగా మొక్కలను పెంచడం ద్వారా వ్యవసాయం పట్ల అవగాహన పెంచుకోవడమే కాకుండా, మధ్యాహ్న భోజనంలో తాజా కూరగాయలను పొందుతున్నారు.





## అక్షరాలయంలో హరిత సౌందర్యం

**అనపర్తి బాలికల ఉన్నత పాఠశాల గార్డెన్**

తూర్పు గోదావరి జిల్లా, అనపర్తిలోని S.D.B.Z.P.P. బాలికల ఉన్నత పాఠశాల నేడు పచ్చదనానికి మారుపేరుగా నిలుస్తోంది. ఈ తోటలో పెరిగిన ఆకుకూరలు, పండ్ల –పూల మొక్కలు పాఠశాల అందాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. మొక్కల పెంపకం ప్రణాళికాబద్ధంగా చేపట్టి, మొక్కలకు తగినంత ఎండ, నీరు అందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బడి తోటలో పశువులు పడి పాడు చేయకుండా, మొక్కల చుట్టూ ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రతిరోజూ మొక్కలకు నీరు పోస్తూ, సంరక్షణ బాధ్యతలు విద్యార్థులు చూస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యాన్ని చాటిచెబుతోన్న అనపర్తి బాలికల ఉన్నత పాఠశాల కిచెన్ గార్డెన్ పచ్చగా కళకళలాడుతోంది.








## 'అక్షయ' కిచెన్ గార్డెన్ ఆహ్లాదం

**ZPHS కాళంగి పాఠశాల**

చిత్తూరు జిల్లా కె.వి.బి.పురం మండలంలోని ZPHS కాళంగి పాఠశాల ఆవరణ ఇప్పుడు పచ్చని కూరగాయల తోటతో కళకళలాడుతోంది. ఈ పాఠశాలలో చిక్కుడు, గుమ్మడి, బెండకాయ, శనగ పంటలను సాగు చేస్తున్నారు. ఈ తోట పెంపకంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒక కుటుంబంలా కలిసి పని చేస్తున్నారు. పాఠశాల సిబ్బంది ఇచ్చే సూచనలను పాటిస్తూ, విద్యార్థులే స్వయంగా విత్తనాలను నాటారు. ఇది వారికి ప్రకృతిపై మక్కువను, వ్యవసాయంపై అవగాహనను పెంచుతోంది. మొక్కల సంరక్షణకు పాఠశాల వాచ్‌మెన్ నిరంతరం శ్రమిస్తూ, క్రమం తప్పకుండా నీరు పోస్తున్నారు. సమిష్టి కృషితో కిచెన్ గార్డెన్ అందంగా తయారు కావడమే కాదు, ఆరోగ్యం పంచుతోంది.



## ప్రకృతి సేద్యం...ఇలా సాధ్యం

**మోపిదేవి ZPHS PLUS పాఠశాల**

కృష్ణా జిల్లాలోని మోపిదేవి ZPHS PLUS పాఠశాల ఆవరణలో పచ్చని తోటతో ఆహ్వానం పలుకుతుంది. ఈ బడితోటకు ఎటువంటి రసాయన ఎరువులు వాడరు. ద్రవజీవామృతం, ఘన జీవామృతం, నీమ్మాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి సహజసిద్ధమైన ద్రావణాలను మొక్కలకు ఉపయోగిస్తున్నారు. పాఠశాల ఆవరణను వివిధ బ్లాకులుగా విభజించి, ఒక్కో తరగతి పిల్లలు, ఉపాధ్యాయుల గ్రూపులకు బాధ్యతలు అప్పగించారు. విద్యార్థులే విత్తనాలు చల్లడం, నీరు పోయడం మరియు కలుపు తీయడం వంటి పనులు చేస్తారు. పండిన పంటను మధ్యాహ్న భోజన పథకానికి విక్రయిస్తారు. దీని ద్వారా వచ్చే ఆదాయం, విత్తనాల ఖర్చుల కోసం ఒక ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహిస్తూ పిల్లలకు ఆర్థిక లావాదేవీల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఈ కిచెన్ గార్డెన్‌లో ఆకుకూరలు, పండ్లు, ఔషధ మొక్కలు పెంచుతున్నారు. ప్రధానోపాధ్యాయురాలు పి. జయంతి పర్యవేక్షణలో, 'నేచురల్ ఫార్మింగ్' బృందం సహకారం, ఉపాధ్యాయులు, పిల్లలు కలిసి ఈ తోటను హరితవనం చేశారు.







## సేంద్రియ తోట.. ఆకుపచ్చని బాట

**పాణింగపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాల**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కె. గంగవరం మండలంలోని పాణింగపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యతోపాటు, ప్రకృతి సేద్యానికి చిరునామా అయ్యింది. ప్రధానోపాధ్యాయులు మేడిశెట్టి పుల్లయ్య సారథ్యంలో, ఉపాధ్యాయులు విద్యార్థుల కృషితో పాఠశాల కిచెన్ గార్డెన్‌లో తోటకూర, గోంగూర, కొత్తిమీర, వంకాయ, ఆనపకాయ, చిక్కుడు, మామిడి, బొప్పాయి, కరివేపాకు వేశారు. బడితోట పనులను విద్యార్థులు చేయడం వల్ల ప్రకృతిపై ప్రేమ, శ్రమ విలువ, సాగు పట్ల అవగాహన పెరుగుతోంది. మధ్యాహ్న భోజన పథకంలో మిగిలిన కూరగాయల తొక్కలు, ఆకుకూరల వ్యర్థాలను కంపోస్ట్ గుంతలో వేసి, వాటి ద్వారా తయారైన సహజ ఎరువును మాత్రమే మొక్కలకు అందిస్తున్నారు. దీనివల్ల ఎటువంటి రసాయనాలు లేని స్వచ్ఛమైన ఆహారం పిల్లలకు అందుతోంది.









## 10 సెంట్లు.. 10 బృందాలు: ఒక వినూత్న ప్రయోగం

**దొడ్లేరు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల**

పల్నాడు జిల్లా, క్రోసూరు మండలంలోని దొడ్లేరు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠాలు, కిచెన్ గార్డెన్‌లో 'ప్రకృతి పాఠాలు' నేర్చుకుంటున్నారు. పాఠశాల ఆవరణలోని పది సెంట్ల భూమిని పది భాగాలుగా చేశారు. 9, 10వ తరగతి విద్యార్థులను గ్రూపులుగా విడదీసి, ఒక్కో గ్రూపునకు ఒక సెంటు భూమిని కేటాయించారు. ఈ పద్ధతి వల్ల విద్యార్థుల్లో బాధ్యతతో పాటు, ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరిగింది. దేశవాళీ విత్తనాలతో ఆకుకూరలు, కూరగాయలను పండిస్తున్నారు. ఉపాధ్యాయుడు మణికంఠ పర్యవేక్షణలో విద్యార్థులే స్వయంగా ఆర్గానిక్ ద్రావణాలను తయారు చేసుకుని చీడపీడల నివారణకు వాడుతున్నారు. కిచెన్ గార్డెన్ పని చేయడం వల్ల విద్యార్థులకు శ్రమ విలువ, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత, సేంద్రియ ఆహారం విలువ తెలుస్తోందని అంటారు పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి. జోష్ మేరి.







## నందనవనం.. 'ఆకుపచ్చని' ఐక్యత

**చిన్న బొడ్డవలస మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల**

విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలోని చిన్న బొడ్డవలస మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పర్యావరణ స్పృహకు నిలయంగా మారింది. ఈ పాఠశాల కిచెన్ గార్డెన్ నిర్వహణ భారం కాకుండా, ఒక బాధ్యతగా మార్చడానికి విద్యార్థులందరినీ ఐదు గ్రూపులుగా విభజించారు. మొదటి గ్రూప్  మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోస్తుంది. రెండో గ్రూప్ మొక్కల చుట్టూ పాదులు పెట్టి వాటి సంరక్షణ చూస్తుంది. మూడో గ్రూప్ తోటలో పెరిగే కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి తోటను శుభ్రంగా ఉంచుతుంది. నాలుగో గ్రూప్ తమ ఇళ్ల వద్ద లభ్యమయ్యే పశువుల ఎరువు సేకరించి కిచెన్ గార్డెన్ కోసం వినియోగిస్తుంది. ఐదో గ్రూప్ మొక్కల పెరుగుదల, దిగుబడిని పర్యవేక్షిస్తుంది. ఈ వినూత్న పద్ధతి వల్ల పాఠశాలలో 70 శాతం విద్యార్థి, ఉపాధ్యాయ భాగస్వామ్యం నెలకొంది. పాఠశాల ఆవరణలో బీరకాయ, వంకాయ, చిక్కుడు, బెండకాయ, టమాటా, పచ్చిమిర్చి, మునగ, అరటి, కరివేపాకు, బొప్పాయి పండిస్తున్నారు.





# ఆకుపచ్చని బడి.. ప్రకృతి ఒడి

**బాపడుపాలెం పాఠశాల హరిత విజయం**



అనకాపల్లి జిల్లా పరవాడ మండలం, బాపడుపాలెం ప్రాథమిక పాఠశాల విద్య నేర్పే బడి మాత్రమే కాదు, విద్యార్థులకు ప్రకృతి ఒడి. పాఠశాలకు కొరుపోలు గంగాధర్ ఒక్కరే ఉపాధ్యాయుడు అయినప్పటికీ, బోధనతో పాటు పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపాలనే లక్ష్యంతో ఆయన ఈ కిచెన్ గార్డెన్‌ను ప్రారంభించారు. విరామ సమయాల్లో స్వయంగా మట్టిని తవ్వి, విత్తనాలు నాటి, మొక్కలను కంటికి రెప్పలా కాపాడుతూ ఈ తోటను అభివృద్ధి చేశారు. ఆయన ఉత్సాహాన్ని చూసి విద్యార్థులు కూడా ఎంతో ఆసక్తితో మొక్కల సంరక్షణలో భాగస్వాములవుతున్నారు. తోటకూర, పాలకూర, వంకాయ, బెండ, టమాటా, జామ, బొప్పాయి వంటివి పండిస్తున్నారు. ఇక్కడ పండిన ప్రతి ఆకుకూర, కూరగాయలు పాఠశాల మధ్యాహ్న భోజన పథకంలో మళ్లీ పిల్లలకే వండి వడ్డిస్తారు.





# నగరంబడిలో నందనవనం

**రాజమహేంద్రవరం శాటిలైట్ సిటీ హైస్కూల్**

రాజమండ్రి శివార్లలోని శాటిలైట్ సిటీ ఉన్నత పాఠశాల ఆవరణలోకి అడుగుపెడితే, విద్యార్థులు పుస్తకాలతో పాటు మట్టితో చేస్తున్న అద్భుత ప్రయోగాలు కనిపిస్తాయి. ఈ పాఠశాల కిచెన్ గార్డెన్ లో టమోటా, వంకాయ, మిరప, అనపకాయ, గోంగూర, పూల మొక్కలు పండిస్తున్నారు. ఈ తోట అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయురాలు ఎన్. ప్రశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. 9వ తరగతి విద్యార్థులు ఈ తోట బాధ్యతను భుజాన వేసుకున్నారు. మొక్కలు నాటడం దగ్గర నుండి, ప్రతిరోజూ వాటికి నీరు పోసి కంటికి రెప్పలా కాపాడటం వరకు వీరి శ్రమ ఎంతో ప్రశంసనీయం. అగ్రికల్చర్ టీచర్ Ch. దేవి, మ్యాజిక్ బస్ సంస్థ ప్రతినిధి T. మరియా విద్యార్థులకు నిరంతరం సాంకేతిక సలహాలు ఇస్తూ, మొక్కలకు వచ్చే తెగుళ్ల నివారణ, సంరక్షణ పద్ధతులను నేర్పిస్తున్నారు.





# అన్ని పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఉండాలి

ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎకో క్లబ్ సభ్యులు (విద్యార్థులు & ఉపాధ్యాయులు) కిచెన్ గార్డెన్ నిర్వహణ బాధ్యతలను తీసుకుంటారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో భాగంగా కిచెన్ గార్డెన్ల స్థితిగతులను, పర్యవేక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లను ఉపయోగిస్తోంది. అన్ని పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు అవసరమైన నిధులు విడుదల చేయడమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఉండేలా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

– ***ఆర్. ఎస్. గంగాభవానీ,*** జాయింట్ డైరెక్టర్,
డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం

– ***గణపతి రావు బెహరా,***
పీఆర్వో, సమగ్ర శిక్ష



# కరెంట్ అఫైర్స్

## అంతర్జాతీయం



### భారత్, ఐరోపా కూటమి (ఈయూ) మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్యం

భారత్, ఐరోపా కూటమి (ఈయూ) మధ్య చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ) కుదిరింది. మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ గా పిలిచే ఈ ఒప్పందాన్ని జనవరి 27న దిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఈయూ నేతలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, ఆంటోనియో కోస్టా సంయుక్తంగా ప్రకటించారు. దీంతోపాటు భద్రత, రక్షణ రంగంలో బంధం మరింత బలోపేతం, భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో అవకాశాలను కల్పించే ఒప్పందాలూ కుదిరాయి. భారత్, 27 ఐరోపా దేశాలు సంయుక్తంగా వచ్చే ఐదేళ్లలో ఈ ఒప్పందంపై అనుసరించాల్సిన వ్యూహాత్మక ఎజెండాను ఖరారు చేశాయి. అయితే దీనికి సంబంధించి రెండు వైపుల నుండి చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఈ ఒప్పందం కారణంగా ఐరోపా కార్లు, మద్యం భారత్లో చౌకగా లభించనున్నాయి. భారతీయ రైతులు, చిన్న పరిశ్రమలవారి ఉత్పత్తులకు ఐరోపా మార్కెట్లో విస్తృత అవకాశాలు లభించనున్నాయి.

### డబ్ల్యూహెచ్వో) నుంచి వైదొలిగిన అమెరికా

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్వో) నుంచి తమ దేశం వైదొలగే ప్రక్రియ పూర్తయిందని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. పరిమిత పరిధి మేరకు డబ్ల్యూహెచ్వో తో కలిసి పనిచేయనున్నట్లు యూఎస్ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. ఇకపై డబ్ల్యూహెచ్వోకు అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు నిలిపివేస్తున్నామని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాని అన్ని కార్యాలయాల నుంచి యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది. ఈ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా తప్పుకొంటున్నట్లు తెలిపింది.

### చైనాలో మళ్ళీ తగ్గిన జనాభా

వరసగా నాలుగో సంవత్సరంలోనూ చైనాలో జనాభా తగ్గింది. దశాబ్దం క్రితం నాటి పరిస్థితితో పోలిస్తే 2025లో దాదాపు కోటి మేర ఈ తగ్గుదల ఉంది. దంపతులకు ఒకే బిడ్డ అనే విధానాన్ని చాలాఏళ్లపాటు అమలుచేయడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని విశ్లేషకులు చెబుతున్నారు. జాతీయ గణాంకాల మండలి (ఎన్బీఎస్) జనవరి 19 న విడుదల చేసిన గణాంకాల ప్రకారం చైనాలో 2025లో 79.2 లక్షలమంది శిశువులు జన్మించారు. 2024లో ఇది 95.4 లక్షలుగా ఉంది. గత ఏడాది 1.13 కోట్లమంది చనిపోయారు. అయిదు దశాబ్దాల్లో ఇదే అత్యధికం.




### వికీపీడియాకు 25 ఏళ్ళు

వికీ అనేది హవాయి భాషా పదం. వికీ అంటే త్వరగా అని అర్థం. వికీపీడియా, దేశ విదేశాల్లోని విశేషాలన్నింటినీ ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచే వేదిక. ఏం కావాలన్నా ఉచితంగా చూసుకోవచ్చు. అవసరమైతే డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఇదేమీ ఒక్కరోజులో తయారైంది కాదు. పాతికేళ్ల ప్రస్థానం. 2001 జనవరి 15న జిమ్మీవేల్స్, ల్యారీసాంగెర్ వికీపీడియా ప్రారంభించగా.. వివిధ దేశాల్లో లక్షలమంది స్వచ్ఛందంగా రాసేవారు ముందుకొచ్చారు. 2026 జనవరి 15న 25 ఏళ్లు పూర్తి చేసుకుంది.

ఈ కాలంలో ఆంగ్ల వికీపీడియాలో 71 లక్షల వ్యాసాలు, వివిధ దేశాలకు చెందిన 6.6 కోట్లకు పైగా వ్యాసాలు పొందుపరిచారు. ప్రస్తుతం 353 భాషల్లో వికీపీడియా ప్రజలకు సమాచారం అందిస్తోంది. తెలుగు వికీపీడియా (తెవికీ) 2003 డిసెంబరులో మొదలైంది. ప్రస్తుతం ఇందులో 1,18,322 వ్యాసాలున్నాయి. సగటున నెలకు 15వేల వ్యాసాలు వికీపీడియాలో చేరుతున్నాయి. కొన్ని ప్రాంతాలకే, కొందరికే పరిమితమైన సైన్స్ పేపర్లు, పుస్తకాలు, వార్తా పత్రికలు, కంప్యూటర్లు, సర్వర్లలోని విజ్ఞానాన్ని గుదిగుచ్చి ప్రపంచం ముందు ఉంచారు.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఎలెనా రిబకినా విజయం

ఎలెనా రిబకినా (కజకిస్థాన్) తన రెండో గ్రాండ్ స్లామ్ టైటిల్ ను గెలుచుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్లో ఆమె విజేతగా నిలిచింది. జనవరి 31న ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో అయిదో సీడ్ రిబకినా 6-4, 4-6, 6-4తో టాప్ సీడ్ అరీనా సబలెంకా (బెలారస్) పై విజయం సాధించింది. 2022 (వింబుల్డన్) లో ఆమె తన తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్ ను గెలుచుకుంది.



## గ్రాండ్ స్లామ్ చరిత్రలో అత్యధిక విజయాలు సాధించిన జకోవిచ్

గ్రాండ్ స్లామ్ చరిత్రలో ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా సెర్బియా దిగ్గజ ఆటగాడు నొవాక్ జకోవిచ్ 400 మ్యాచ్ లలో విజయం సాధించారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ లో ప్రిక్వార్టర్స్ చేరే క్రమంలో మూడో రౌండ్లో నొవాక్ 6-3, 6-4, 7-6 (7-4)తో బొటిక్ (నెదర్లాండ్స్) పై గెలవడం ద్వారా గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో 400 విజయాలు సాధించిన తొలి ప్లేయర్ గా జకోవిచ్ ఘనత సాధించాడు. ఫెదరర్ (369), నాదల్ (314) వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నారు.

## తమిళనాడులో విద్యార్థినుల కోసం కొత్త పథకం

తమిళనాడులో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థినులకు గర్భాశయ క్యాన్సర్ నిరోధక వాక్సిన్ (హెచ్ పీవీ)లు వేసే పథకాన్ని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ చెన్నైలో జనవరి 27న ప్రారంభించారు. తొలి విడతగా గర్భాశయ క్యాన్సర్ ప్రభావం ఎక్కువగా ఉన్న ధర్మపురి, పెరంబలూర్, తిరువణ్ణామలై, అరియలూర్ జిల్లాల్లో ఈ పథకం అమలు చేస్తారు.




## 500 మ్యాచ్ లలో విజయాలు సాధించిన సింధు

భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు అరుదైన ఘనత సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ లో 500 మ్యాచ్ లలో విజయాలు సాధించిన ఆరో క్రీడాకారిణిగా ఘనత అందుకుంది. ఈ రికార్డు నమోదు చేసిన తొలి భారత షట్లర్ గా చరిత్ర సృష్టించింది. ఇండోనేసియా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 500 టోర్నీలో సింధు ఈ చిరస్మరణీయ విజయంతో క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది.

ప్రిక్వార్టర్స్ లో భారత స్టార్ 21-19, 21-18తో లైన్ హోయ్మార్క్ (డెన్మార్క్)పై గెలుపొందింది. మహిళల సింగిల్స్ లో సింధు కంటే ముందు ఇంతానన్ రచనోక్ (థాయ్ లాండ్), తై జు యింగ్ (చైనీస్ తైపీ), అకానె యమగూచి (జపాన్), కరోలినా మారిన్ (స్పెయిన్), పెత్యా నెదెల్చెవా (బల్గేరియా) మాత్రమే 500 విజయాలు నమోదు చేశారు.

# జాతీయం

## మహిళలు, బాలికలకు నెలసరి శుభ్రత కూడా ప్రాథమిక హక్కే

చదువుకునే అవకాశం అందరికీ కల్పించే విద్యాహక్కు, లింగసమానత్వ హక్కు జీవన హక్కు కోవలోనే... మహిళలు, బాలికలకు నెలసరి శుభ్రత కూడా ప్రాథమిక హక్కేనంటూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ క్రమంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, పాఠశాలలకు జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం జనవరి 30న పలు ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థినులకు పర్యావరణహితమైన రుతు రుమాళ్లు (శానిటరీ న్యాప్కిన్స్)ను ఉచితంగా అందించాలని తెలిపింది. అందరికీ కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని, శుభ్రమైన టాయిలెట్లను బాలికలకు, బాలురకు, దివ్యాంగులకు విడివిడిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేస్తూ తీర్పు వెలువరించింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ ఆదేశాలను పాటించాలని స్పష్టం చేసింది. బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేయకపోతే ప్రైవేటు పాఠశాలలు గుర్తింపు కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.

రుతుక్రమ ఆరోగ్య హక్కు అనేది రాజ్యాంగంలోని అధికరణం 21 కిందకు వచ్చే జీవన హక్కులో భాగమని వ్యాఖ్యానించింది. బాలికలకు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల వారి చదువు, ఆరోగ్యం, గౌరవం దెబ్బతింటాయని, ఇది సమానత్వ హక్కుకు కూడా విరుద్ధమని న్యాయస్థానం అభిప్రాయపడింది. టాయిలెట్లను ఏర్పాటు చేయడంలో, రుతురుమాళ్లను ఉచితగా అందించడంలో రాష్ట్రాలు విఫలమైతే వాటినీ జవాబుదారులుగా నిలబెడతామని స్పష్టం చేసింది.

## శుభాంశు శుక్లాకు అత్యున్నత శౌర్య పురస్కారం

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)ను సందర్శించిన తొలి భారతీయుడిగా రికార్డుకెక్కిన వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు ప్రభుత్వం ఘనమైన గుర్తింపునిచ్చింది. శాంతికాలంలో ఇచ్చే అత్యున్నత శౌర్య పురస్కారం 'అశోక చక్ర' కు ఎంపిక చేసింది. భారత్ సొంతంగా చేపట్టబోయే మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్ యాన్ కు ఎంపికైన మరో వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ రెండో అత్యున్నత శౌర్య పురస్కారం 'కీర్తి చక్ర'కు ఎంపికయ్యారు.



## సరికొత్త ఆధార్ యాప్ ను అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆధార్ యాప్ ను అందుబాటులోకి తెచ్చింది. దేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే లక్ష్యంతో దీనిని తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్ తో ఆధార్ సర్వీసులు మరింత సరళంగా, సురక్షితంగా మారనున్నాయి. జనవరి 28 దిల్లీలో డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ యాప్ ను జాతికి అంకితం చేశారు. 2009 లో జనవరి 28న ఆధార్ ను ప్రారంభించారు.

ఈ యాప్ ద్వారా వెంటనే ఆధార్ వెరిఫికేషన్ చేసుకోవచ్చు. చిరునామా, మొబైల్ నంబర్ను అప్డేట్ చేసుకునే సౌలభ్యం ఉంది. ఆధార్ కాంటాక్ట్ కార్డ్ ద్వారా అత్యంత గోప్యంగా వివరాలను పంచుకోవచ్చు.. ఎవరికైనా షేర్ చేసినప్పుడు మొత్తం వివరాలు కాకుండా అవసరమైనవి మాత్రమే కనిపించేలా ఏర్పాటు. ఈ యాప్ ద్వారా ఐదుగురి వరకు ప్రొఫైల్ వివరాలు క్రియేట్ చేసుకోవచ్చు.

భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) ఆధార్ కొత్త మస్కట్ ను ప్రారంభించింది. దీనికి యూడీఏఐ(ఉదయ్) అని పేరుపెట్టారు. ఆధార్ సేవలపై ప్రజలకు మరింత లోతుగా అవగాహన కల్పించడం, సేవలను వారికి చేరువ చేయడమే లక్ష్యంగా కొత్త మస్కట్ ను ఆవిష్కరించారు.




## ఉత్తమ పనితీరు కనబరుస్తున్న విశాఖ పోర్ట్

దేశంలోనే ఉత్తమ పనితీరు కనబరుస్తున్న నౌకాశ్రయంగా, ప్రపంచంలో టాప్-100లో ఒకటిగా విశాఖ పోర్ట్ స్థానం దక్కించుకున్నట్లు కేంద్ర ఓడరేవులు, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు. విశాఖలోని సాగరమాల కన్వెన్షన్లో విశాఖ పోర్ట్ అథారిటీకి సంబంధించిన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు ఆయన జనవరి 10న శంకుస్థాపన చేసారు.

## బెంగళూరు- విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో నాలుగు గిన్నిస్ రికార్డులు

బెంగళూరు- విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో రాజ్పథ్ ఇన్ఫ్రాకాన్ గుత్తేదారు సంస్థ నాలుగు గిన్నిస్ రికార్డులు సృష్టించింది. జనవరి 6న బొంతలపల్లి సమీపంలో 28.89 లేన్ కిలోమీటర్ల పొడవైన రహదారిని 24 గంటల్లోపు పూర్తి చేసి మొదటి రికార్డు సృష్టించింది. అలాగే 24 గంటల్లో అత్యధికంగా 10,655 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్ ను నిరంతరం వేసి రెండో రికార్డు సాధించింది. ఈ నెల 11 వరకు 57,500 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్ ను నిరంతరంగా వేసి మూడో రికార్డును, మొత్తం 156 లేన్ కిలోమీటర్ల (26 కిలోమీటర్ల మేర 6 వరుసలు) పొడవైన రహదారిని నిరంతరంగా నిర్మించి నాలుగో రికార్డును సృష్టించింది.

## 'ఏపీ ఎడ్వాంటేజ్' కార్యక్రమం

ఏపీలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఇంధనం, డిజిటల్ ఇన్ఫ్రా, లాజిస్టిక్స్, తయారీ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులకు అవకాశాలున్నాయని వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా జరిగిన 'ఆంధ్రప్రదేశ్ ఎడ్వాంటేజ్ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు చూశాకే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. 1,054 కిలోమీటర్ల తీరం, పోర్టులు, ఎయిర్పోర్టులే రాష్ట్రానికి బలమని ఉద్ఘాటించారు. 2047 నాటికి భారత్ ప్రపంచశక్తిగా మారుతుందని, అందులో ఏపీ ముందంజలో ఉంటుందని వివరించారు.

## కీర్తి చక్ర పురస్కారం అందుకున్న మేజర్ మల్లా రామ్‌గోపాల్‌నాయుడికి నగదు బహుమతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్మ్డ్ ఫోర్సుల్లో 'చక్ర' అవార్డు అందుకున్న వారికి నగదు బహుమతులు ప్రకటించింది. అందులో భాగంగా కీర్తి చక్ర పురస్కారం అందుకున్న మేజర్ మల్లా రామ్‌గోపాల్‌నాయుడికి రూ.1.25 కోట్ల నగదు బహుమతి ప్రకటించింది. దేశానికి సేవ చేసిన ఆయన ధైర్యసాహసాలకు గుర్తింపుగా ఈ బహుమతి లభించింది. 2023లో జమ్మూ కాశ్మీర్ నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదులతో పోరాడి, తన ప్రాణాలను పణంగా పెట్టి, తోటి సైనికులను రక్షించిన ఆయన వీరత్వానికి ఈ పురస్కారం దక్కింది. ఆయన శౌర్య పురస్కారం అందుకున్న ఏకైక తెలుగు మేజర్.

## పక్షవాతం రోగులకోసం ప్రత్యేక గ్లోవ్స్

పక్షవాతం వల్ల బాధితులు మంచానికే పరిమితం అయ్యే అవకాశం ఉంది. అలాంటి వారి కోసం మధ్యప్రదేశ్ జబల్ పూర్ లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ఐఐఐటీడీఎం) విద్యార్థి బృందం ప్రత్యేక గ్లోవ్స్ ను తయారుచేసింది. రియా జైన్ నేతృత్వంలోని విద్యార్థుల బృందం దీన్ని రూపొందించింది. వీటిని చేతికి పెట్టుకుని పక్షవాత రోగులు సులభంగా వ్యాయామాలు చేయవచ్చు. ఇటీవల ఢిల్లీలో జరిగిన యూత్ టెక్ ఛాలెంజ్లో ఈ ఆవిష్కరణ మొదటి బహుమతిని గెలుచుకుంది. వీటిని రూపొందించిన విద్యార్థులపై ప్రధాని మోదీ, కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రశంసలు కురిపించారు. ఈ గ్లోవ్స్ కు 'ఫ్లెక్సురా హ్యాండ్ గౌవ్స్' అనే పేరు పెట్టారు. పేటెంట్ కూడా లభించింది.



# ఆరోగ్య క్రీడాంధ్రప్రదేశ్ లక్ష్యం

* ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వ్యాయామ విద్య తప్పనిసరి
* వ్యాయామ విద్యతో విద్యార్థుల్లో శారీరక,మానసిక వికాసం
* పాఠశాలల నుంచే భవిష్యత్తు క్రీడాకారులకు మార్గనిర్దేశనం

## ఆటవిడుపు

పిల్లల సమగ్ర వికాసానికి విద్యతోపాటు ఆరోగ్యం-ఆనందం ఇచ్చి, భవితకు బాటలు వేసే క్రీడలూ, వ్యాయామ విద్య తప్పనిసరి అని విద్యావేత్తలు, నిపుణులు తమ నివేదికల్లో దశాబ్దాల క్రితమే స్పష్టం చేశారు. చిననాటి నుంచే వ్యాయామ విద్య, క్రీడలను పిల్లలకు అలవాటు చేయాలి. దీనివల్ల క్రమశిక్షణ, శారీరక, మానసిక ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలు అలవడిన విద్యార్థులు భావిభారత ఉత్తమ పౌరులు తయారు అవుతారు.

### పునాది దశ నుంచే..

పాఠశాల స్థాయిలో వ్యాయామ విద్య అనేది విద్యార్థుల శారీరక, మానసిక, భాగోద్వేగ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఎంతో ముఖ్యమైనది. బృంద స్ఫూర్తి, సమిష్టితత్వం, నాయకత్వ లక్షణాలు అలవడతాయి. వ్యాయామ విద్య అంటే కేవలం ఆటలు ఆడటం మాత్రమే కాదు, ఆరోగ్య అలవాట్లు, ఒత్తిడిని అధిగమించడం, జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు దోహదపడుతుంది.

### శారీరక, వ్యాయామ విద్య చరిత్ర

**ప్రాచీన కాలంలో:**

శారీరక విద్య సూర్య నమస్కారాలు , యోగా, యుద్ధ కళలు, చదరంగం, కర్రసాము, మల్ల యుద్ధం, కత్తిసాము ద్వారా నేర్పించేవారు.

**బ్రిటిష్ కాలంలో :**

బ్రిటిష్ పాలనలో శారీరక విద్య జిమ్నాస్టిక్స్, డ్రిల్ రూపంలో పాఠశాలలో ప్రవేశపెట్టారు. 1920లో మద్రాసులో నెలకొల్పిన YMCA కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ దక్షిణ ఆసియాలో మొదటి శారీరక విద్యా కళాశాల. ఆంధ్రప్రదేశ్ వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణకు ఇది కేంద్రంగా ఉండేది.

**ఆంధ్రప్రదేశ్‌లో :**

* 1927లో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు, ఆంధ్రా యూనివర్సిటీలో స్థాపించారు
* 1930లో శారీరక శిక్షణ పథకం అమలు కావడం ఉన్నత విద్యలో తొలి అడుగు
* 1967లో ఏర్పడిన శ్రీ సీతారామ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ లో వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేవారు
* 1982 ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ యాక్టు శారీరక విద్య అవసరాన్ని ప్రస్తావించింది
* 2000లో తెలుగుదేశం ప్రభుత్వం శారీరక విద్యను పాఠశాల పాఠ్యప్రణాళికలో భాగం చేసింది













* 2012 G.O.M.S. No.63 ద్వారా పాఠశాలల్లో శారీరక విద్యను తప్పనిసరి చేసారు.

* 2015లో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (SAAP) శారీరక విద్యను పాఠశాల సిలబస్ తో చేర్చింది. ఇతర సబ్జెక్టుల మాదిరిగా పరీక్షలు నిర్వహించాలని సిఫారసు చేసింది.

* 2024లో ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ పాలసీ 2024- 29 జారీచేసి అమలు చేస్తోంది

* 2025 డిసెంబరులో పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఒకటి నుండి 10వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వ్యాయామ విద్య తప్పనిసరి.

* దీనిలో భాగంగా ప్రతి విద్యార్థి ప్రతిరోజు కనీసం ఒక గంట శారీరక శ్రమ, వ్యాయామ విద్య, క్రీడలు, యోగ, ఆరోగ్య విద్య, డ్రిల్ చేసేలా చూడాలి. వారానికి ఆరు పీరియడ్లు కేటాయించాలి.

## వ్యాయామ విద్యతో ప్రయోజనాలు

* విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుంది

* ఆరోగ్యంపై అవగాహన కలుగుతుంది

* క్రమశిక్షణ అలవడుతుంది

* ఊబకాయం, ఒత్తిడి, మానసిక సమస్యలు తగ్గుతాయి.

* శారీరకంగా దృఢంగా తయారవుతారు

* ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది.

* భవిష్యత్తులో క్రీడల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులైన క్రీడాకారులు తయారవుతారు

* ప్రభుత్వ విజన్ అయిన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, క్రీడాంధ్రప్రదేశ్ సాధ్యం అవుతుంది

## ఆరోగ్య క్రీడాంధ్రప్రదేశ్ దిశగా..

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారుగా 9,000 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాలల్లో శారీరక, వ్యాయామ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆరోగ్య క్రీడాంధ్రప్రదేశ్ దిశగా కృషి చేస్తున్నారు. ఎన్సీఈఆర్టీ వ్యాయామ విద్య సిలబస్ ను అమలుపరుస్తూ క్రీడలు, యోగ, వ్యాయామ విద్య ద్వారా పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతున్నారు.

## పరీక్షలు ఇలా..

ప్రతి సంవత్సరం పాఠశాల విద్యా సంవత్సరంలో రెండుసార్లు జూలై, ఫిబ్రవరి నెలలో విద్యార్థుల శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు ఏ క్రీడలకు సరిపోతారో, వారి స్థాయిని బట్టి, ఏ క్రీడల్లో శిక్షణ ఇస్తే, మెరుగైన ఫలితాలు వస్తాయో గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

## ప్రత్యేక సందర్భాల్లో..

ప్రతి సంవత్సరం జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం, పాఠశాల ఇంట్రామ్యూరల్ పోటీలు, ఆగస్టు 15 ఇండిపెండెన్స్ డే, జనవరి 26 రిపబ్లిక్ డే వంటి ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థులతో శారీరక విన్యాసాలు, పిరమిడ్లు , మాస్టర్ లెజిమ్స్, డంబిల్ వంటి కృత్యాలను విద్యార్థులతో ప్రదర్శింపజేసి, వారిలో దాగివున్న శారీరక నైపుణ్యాలను వెలికి తీస్తారు.

## ఉపాధ్యాయుల బాధ్యత ఇదీ..

రోజూ డ్రిల్ చేయించడం, క్రమశిక్షణ నేర్పడం, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, టీం స్పిరిట్, శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించడంలో వ్యాయామ ఉపాధ్యాయులదే ప్రధాన పాత్ర. క్రీడాకారులు తీర్చిదిద్దడం, ఎంపిక చేసిన క్రీడాకారులను పాఠశాల సమయం తర్వాత కూడా ఆటలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, రాష్ట్ర, జాతీయ క్రీడా పోటీలలో పతకాలు సాధించేలా వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు.

## సవాళ్లు అధిగమిస్తూ..

కొన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఆటస్థలం లేకపోవడం, నగరాలు-పట్టణాల పాఠశాలలకు స్థలం లభ్యత లేకపోవడం వ్యాయామ విద్యకు ఒక సవాల్ అవుతోంది. సవాళ్లను అధిగమిస్తూ ప్రభుత్వం ఆయా పాఠశాలలకు క్రీడా పరికరాలు సరఫరా చేస్తోంది. వ్యాయామ విద్య అన్ని పాఠశాలల్లో అమలయ్యేలా చూస్తోంది. ప్రైవేట్ పాఠశాలల్లో కూడా తప్పనిసరిగా వ్యాయామ విద్యను అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ లో ఏ పాఠశాల అయినా వ్యాయామ విద్య ఇప్పుడు తప్పనిసరి చేశారు. సమగ్ర విద్యలో వ్యాయామ విద్య అంతర్భాగం చేశారు.

- **యోగా పూర్ణ,** వ్యాయామ నిర్దేశకుడు, యోగ స్టేట్ రిసోర్స్ పర్సన్, 9951635035






## బొమ్మ గీశానోచ్!

**మోటూరి రోహిత శ్రీ లక్ష్మీ దుర్గ,** 5 వ తరగతి MPPPS, నల్లచెరువు, అయినవిల్లి మండలం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్



– **బి.రాహూల్,** 4వ తరగతి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొత్తూరు, భోగాపురం మండలం, విజయనగరం జిల్లా





– **ఎస్. కనిస్ ఫాతిమా,** 7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎన్. చిక్కేపల్లి, యాడికి మండలం, అనంతపురం జిల్లా



**B.వైష్ణవి,** 7వ తరగతి, పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెంట,బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా


## చుక్కలు కలపండి



## రంగులు వేయండి







**మీసాల జ్యోత్స్న లక్ష్మీ దేవి** 5 వ తరగతి, మండల ప్రజా పరిషత్ మోడల్ ప్రై మరీ స్కూల్. నల్లచెరువు, అయినవిల్లి మండలం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా..

# చీకటి చెప్పిన నిజం ( కథ )

ఒక పెద్ద ధనవంతుడి ఇంటిలో ఒక అద్దాల అర ఉండేది. అందులో రకరకాల ఖరీదైన వస్తువులు ఉండేవి. వాటన్నిటిలోకి ఒక బంగారు నెమలి విగ్రహం చాలా అందంగా తళతళ మెరుస్తూ ఉండేది. దానికి తన అందం చూసి చాలా గర్వం.

ఆ అద్దాల అర ఉండే గదిలోనే ఓ మూలన చిన్న గూడులో ఒక పాత మట్టి ప్రమిద ఉండేది. అది నల్లగా, జిడ్డుగా చూడటానికి ఏమాత్రం ఆకర్షణీయంగా ఉండేది కాదు.

రోజు ఆ బంగారు నెమలి మూలన ఉన్న మట్టి ప్రమిదను చూసి వెటకారంగా నవ్వేది. "చూడు నువ్వు ఎంత వికారంగా ఉన్నావో.. ఎవరైనా ఇంటికి వస్తే నన్ను చూసి 'వారేవా!' అంటారు. నిన్ను చూస్తే మాత్రం ముఖం తిప్పుకుంటారు. నా పక్కన ఉండడానికి కూడా నువ్వు అనర్హురాలివి.." అని ఎగతాళి చేసేది.

మట్టి ప్రమీద మాత్రం ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండేది.

ఒకరోజు రాత్రి భయంకరమైన తుఫాను వచ్చింది. ఈదురు గాలులకు కరెంటు తీగలు తెగిపోయాయి. ఒక్కసారిగా ఇల్లంతా చీకటి అలముకుంది. ఆ ఆడంబరమైన ఇంట్లో కనీసం అడుగు తీసి అడుగు వేయడానికి కూడా కనిపించనంత కటిక చీకటి.

ఆ చీకట్లో ఆ బంగారు నెమలి అందం ఎవరికీ కనిపించలేదు. దాని తళుకు బెళుకులు ఆ చీకటిని ఏమాత్రం పోగొట్టలేకపోయాయి. ఆ నెమలి భయంతో వణికిపోయింది.



"నా అందం ఇప్పుడు ఎందుకు పనికి రావడం లేదు.." అని మదనపడింది.

అప్పుడు ఆ ఇంటి యజమాని తడుముకుంటూ హాల్లోకి వచ్చాడు. లక్షల విలువ చేసే ఆ బంగారు నెమలి పక్కనే ఉన్నా దాన్ని పట్టించుకోలేదు. చేత్తో తడుముతూ మూలన ఉన్న పాత మట్టి ప్రమాదను వెతికి పట్టుకున్నాడు.

వెంటనే అందులో నూనె పోసి ఒత్తి వెలిగించాడు. అంతే ఆ చిన్న మట్టి ప్రమిద నుంచి వచ్చిన వెలుగు ఆ గదిలోని చీకటిని పారద్రోలింది. ఆ వెలుగులో ఇల్లంతా ప్రశాంతంగా మారింది. ఆ ప్రమిద వెలుగు పడడం వల్లే ఇప్పుడు ఆ బంగారు నెమలి మళ్ళీ మెరవడం మొదలుపెట్టింది.

ఆ క్షణం నెమలికి జ్ఞానోదయం అయింది. "నా అందం కనిపించాలన్నా.. నీ వెలుగే ఆధారం. పదిమందికి దారి చూపించే నీ గుణం ముందు షోకేస్ లో బందీగా ఉండే నా అందం చాలా చిన్నది.." అనుకొని మనసులో ప్రమిదకు క్షమాపణ చెప్పుకుంది.

– **కొమిరిశెట్టి సింధూ,** 9వ తరగతి,
జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల,
వినుకొండ, పల్నాడు జిల్లా

## సహాయం కోతులు

అనగనగా పునిగిరి అనే గ్రామంలో చాలా కోతులు ఉండేవి. అవి చాలా మంచివి. అవి ఊరిలో ఉన్న అందరికీ సహాయం చేసేవి. అవి పిల్లలతో చాలా హాయిగా ఆడుకునేవారు. ఆ కోతులన్నీ ఊరిలో ఏ ఫంక్షన్ అయినా ఏ పెళ్లయినా అవి వెళ్లి సహాయం చేసేవి. వాళ్లందరిలో ఒక కోతి చాలా చెడ్డది. దాని పేరు చంటి. ఆ కోతి ఊరిలో ఎవరికీ సహాయం చేసేవి కావు. మళ్లీ ఆ ఊరిలో ఉన్న పిల్లల్ని గోరులతో గిచ్చేసేది. మిగతా కోతులు అలా చేయకూడదు అని చెప్పినా వినేది కాదు . అప్పుడు మిగతా కోతులు ఇంకా ఎంత చెప్పినా లాభం లేదని ఊరిలో నుంచి పంపించే సాయి. అప్పుడు పిల్లలంతా సంతోషంగా ఉన్నారు.

అప్పట్లో మిగతా కోతులు కూడా చెడ్డగా ప్రవర్తించేవి. అలా ప్రవర్తించేటప్పుడు ఊరిలో ఉన్న జనాలకి కోపం వచ్చింది. అప్పుడు ఊరిలో ఉన్న జనాలు అందరూ తరిమేసాయి. ఆ కోతులు తప్పు తెలుసుకొని ఊరి చివరన ఉన్నాయి. ఆ తరువాత మంచిగా మారి ఊరిలోకి వచ్చాయి. అప్పుడు ఊరిలో అందరూ ఇవి మంచివని తమా ఇళ్లల్లో పెట్టుకున్నాయి.

– **శరణ్య శ్రీ,** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అలుగోలు, నెల్లిమర్ల మండలం, విజయనగరం జిల్లా



## నీటి చుట్టరికం

నీళ్లు కనిపిస్తేనే
నదంటే ఎలా?

ఖాళీగా ప్రవహిస్తూ
మనసును తడుపుతుంటే
తెలియడం లేదా?

ఎర్రటి ఎండలకు చిట్లి
నీటి మడుగులతో గాయమైనా
దప్పిక తీర్చాలనే ఆశతో

వాన బొట్టు కనిపిస్తే
ఒడిసి పట్టి దాచినంత దాచి
విశాలంగా ఊర్లకు పంచుకుంటూ
పొలాలని పలకరించుకుంటూ

ఎక్కడ ఒదాగాలో ఒదిగి
హద్దు భుజాలపై ఊరేగుతూ
ప్రతి ఒక్కరిని ఒద్దు నెక్కించుకొని
లోతుగా ప్రవహిస్తుంటే ఎంత గర్వమో!

ఈ నది నాదని
ఈ నీళ్లు నావని
పనివాడు చేతిలో పడవ
పనివాడు చేతిలో పార
నీటి చుట్టరికానికి పొంగిపోతున్నాయి.

– **చందలూరి నారాయణరావు**, టీచర్
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ధర్మవరం, బాపట్ల జిల్లా

# విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలకు గౌరవం

మన రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటి రాష్ట్ర గర్వకారణంగా నిలిచారు. నీతి ఆయోగ్ (NITI Aayog) ఆధ్వర్యంలోని 'అటల్ ఇన్నోవేషన్ మిషన్' (AIM) నిర్వహించిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ (SIM) 2024-25లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన రెండు ఏపీ ప్రభుత్వ పాఠశాలలు ఢిల్లీలో జరిగిన 77వ రిపబ్లిక్ డే వేడుకలకు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.

**విజేతలు - వారి ఆవిష్కరణలు:**

1. శ్రీకాకుళం జిల్లా, ఇప్పిలి ZPHS విద్యార్థులైన ఇప్పిలి సంజన & బృందం బయాలజీ టీచర్ ఉమామహేశ్వరి సువ్వారి సహకారంతో రూపొందించిన ప్రాజెక్ట్ 'డ్యూయల్ యాక్సిస్ సోలార్ ట్రాకింగ్ ఎలక్ట్రికల్ సిస్టమ్' (సూర్యరశ్మిని అనుసరించి తిరిగే సోలార్ ప్యానెల్స్)

2. కృష్ణా జిల్లా మొవ్వ SMK ZPHS విద్యార్థులు దావు స్నేహ & కాకి సౌమ్య తమ గైడ్ టీచర్ మహమ్మద్ జాకీర్ అహ్మద్ పర్యవేక్షణలో రూపొందించిన ప్రాజెక్టు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (A.I.) ద్వారా క్యాన్సర్ గడ్డలను ప్రాథమిక దశలోనే గుర్తించి, మహిళల ప్రాణాలు కాపాడేలా ఈ ఏఐ మోడల్‌ను తీర్చిదిద్దారు.

**ఆవిష్కరణల్లో ఆంధ్రప్రదేశ్ హవా:**

1. స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండవ స్థానంలో నిలిచింది.

2. మొత్తం 5,443 పాఠశాలల నుండి 61,027 మంది విద్యార్థులు చురుగ్గా పాల్గొని 8,748 వినూత్న ఆలోచనలను అందించారు.

3. జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన టాప్ 1,000 ప్రాజెక్టులలో 57 ఐడియాలు మన రాష్ట్రం నుండే ఉండటం విశేషం.

**సమగ్ర శిక్ష - UNICEF సహకారం:**

రాష్ట్రంలోని విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ATL) ఎంతగానో దోహదపడుతున్నాయి. యూనిసెఫ్ (UNICEF) భాగస్వామ్యంతో ఏపీలో ఇన్నోవేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేశారు.










# ఉల్లాసం... ఉత్సాహం రంగోత్సవం

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ, సాంస్కృతిక చైతన్యాన్ని నింపే లక్ష్యంతో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రంగోత్సవ పోటీలు కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని మురళీ రిసార్ట్సులో జరిగాయి. రాష్ట్రంలోని 23 జిల్లాల నుండి సుమారు 250 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జానపద నృత్యం, పాత్రధారణ, చేతిరాత, చిత్రలేఖనం, రంగోలి విభాగాల్లో విద్యార్థులు తమ అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సమగ్ర శిక్ష ఏఎస్పీడీ–1 డాక్టర్ ఎం.ఆర్. ప్రసన్న కుమార్, ఏఎస్పీడీ–2 శ్రీ కె.రవీంద్రనాథ్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ శైల కల్పన, సమగ్ర శిక్ష డిప్యూటీ డైరెక్టర్ అనురాధ అందజేశారు.






## విద్యాహక్కు చట్టం - 2009, సెక్షన్ 12(1)(సి) ప్రకారం 2026 - 27 విద్యాసంవత్సరానికి గాను 1 వ తరగతిలో ఉచిత అడ్మిషన్లు ప్రారంభం

समग्र शिक्षा
Samagra Shiksha
సమగ్ర శిక్ష

### ఇప్పుడు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి

RTE చట్టం సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాల మరియు బలహీన వర్గాల పిల్లలకు రాష్ట్రంలో వారి సమీప నివాస ప్రాంతంలోని CBSE/ICSE/IB/State సిలబస్‌ను అనుసరిస్తున్న అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచితంగా 25% సీట్లు కేటాయింపు.

### దరఖాస్తు ఎక్కడ ఎలా సమర్పించాలి?

www.cse.ap.gov.in సందర్శించండి లేదా, మీ దగ్గరలోని సచివాలయం/ ఇంటర్నెట్ / మండల విద్యాశాఖాధికారి కార్యాలయం / మీ-సేవా సెంటర్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.




### అర్హత వయస్సు

* CBSE/ICSE/IB/ సిలబస్ ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశం కోసం ఏప్రిల్ 2, 2020 నుండి మార్చి 31, 2021 మధ్య జన్మించి 5 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.
* State సిలబస్ ను అనుసరిస్తున్న పాఠశాలలలో ప్రవేశం కోసం జూన్ 2, 2020 నుండి మే 31, 2021 మధ్య జన్మించి 5 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.

### దరఖాస్తు తేదీలు

తేదీ: 20-02-2026 నుండి
తేదీ: 10-03-2026 వరకు
www.cse.ap.gov.in సంప్రదించండి.
Toll Free: 1800-4258-599
సంప్రదించు వేళలు:
ఉ.9 గం.ల నుంచి సా. 6 గం.ల వరకు

రిజిస్టర్ చేయడానికి www.cse.ap.gov.in వెబ్ సైట్ లాగిన్ చేయండి

### ఎవరు అర్హులు?

సంక్షేమ పథకాల నియమావళి ద్వారా ఎలిజిబిలిటీ ధృవీకరించిన పిల్లలు క్రింద తెలిపిన వివరాల ప్రకారం అర్హులు.

| | |
|---|---|
| ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలు (అనాథ పిల్లలు, హెచ్.ఐ.వి బాధితులు మరియు దివ్యాంగులు) | 5 % |
| షెడ్యూల్డ్ కులాలు | 10 % |
| షెడ్యూల్డ్ తెగలు | 4 % |
| బలహీన వర్గాలకు చెందిన బి.సి, మైనారిటీ, ఓ.సి (గ్రామీణ ప్రాంత కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ.1,20,000 మరియు పట్టణప్రాంతం కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ. 1,44,000 లోబడిన కుటుంబాల పిల్లలకు) | 6 % |
| మొత్తం | 25 % |

**జారీ చేసినవారు: రాష్ట్ర పథక సంచాలకులు, సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.**

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh. K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P. For mail: manabadimagazine@gmail.com, manabadimagazine@apschooledu.in, Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur